సాక్షి
వికారాబాద్
శనివారం, 7, జనవరి, 2023



అర్హులకు 'ఆత్మ నిర్భర్'

చిరు వ్యాపారాలకు ఆత్మ నిర్భర్ పథకం భరోసా నిస్తోంది. ఎలాంటి పూచికత్తు లేకుండానే రుణాలు అందిస్తున్నారు. 4లో▸



'మహా సమ్మేళన్'పై ఫోకస్

బూత్ స్థాయి సభ్యుల మహాసమ్మేళన్‌పై బీజేపీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం నియోజకవర్గ కేంద్రాలలో జరగనుంది. 4లో▸



డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి

గృహ అవసరాలకు ఉపయోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. 5లో▸

న్యూస్‌రీల్

జాపర్‌పల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, లాల్‌కృష్ణ

పరిగి: మండల పరిధిలోని జాపర్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించారు. శుక్రవారం మంత్రి నివాసంలో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యతో కలిసి రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 5వేలకు పైగా జనాభా ఉందని, కానీ ప్రజలకు ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేవన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

లోకాన్ని వీడినా.. మరొకరికి చూపునిస్తూ ..

- ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి కళ్లు దానం
- మృత్యువు కబళిస్తున్న క్షణంలోనూ ఉదారత చాటిన యువకుడు



రాము (ఫైల్)

కుల్కచర్ల: మృత్యువుతో పోరాడుతూనే.. మరోవైపు ఉదారత చాటాడు ఓ యువకుడు. తాను మృతి చెందితే తన కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేయాలని కోరాడు. ఆ యువకుడి మరణానంతరం ఆస్పత్రికి కళ్లను దానం చేశారు కుటుంబ సభ్యులు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి కృష్ణయ్య కుమారుడు రాము (22)కు వివాహమైంది. కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురై క్రిమిసంహారక మందు సేవించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న క్రమంలో తాను మృతిచెందితే తన కళ్లను దానం చేయాలని కుటుంబీకులకు సూచించాడు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించారు. రాము కళ్లను తీసుకుని ఇతరులకు అందించారు.

'జాతీయ రహదారి' ప్రశ్నార్థకం

ప్రమాదాలు నిత్యకృత్యం

జాతీయ రహదారి నిర్మాణం విషయంలో నేతల హడావుడే తప్ప కార్యరూపం దాల్చడంలేదు. టెండర్లు పూర్తయి 10 నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. మన్నెగూడ నుంచి హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీ వరకు చేపట్టనున్న నాలుగులేన్ల రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇరుకుగా ఉన్న ఈ రహదారిలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. యేటా సుమారు 200 మందికి పైగా వివిధ రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. అయినా పాలకులు దృష్టిసారించకపోవడం గమనార్హం.



నాలుగు లేన్ల రహదారిగా విస్తరించాల్సిన మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ రహదారి ఇదే..

'మన్నెగూడ' హైవే పనులు ప్రారంభమెప్పుడో?

- నిర్మాణంలో వీడని జాప్యం..
- టెండర్ ప్రక్రియ ముగిసి పది నెలలు
- నేటికీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే
- దారి ఇరుకుతో ఏటా 200 మందికిపైగా మృత్యువాత
- ఫోర్ వేకు గ్రీన్ సిగ్నల్ అంటూ రెండేళ్లుగా ప్రచారం

వికారాబాద్: దశాబ్ద కాలంగా ఈ రహదారి విషయంలో నేతలు ప్రతిపాదనలు పంపటం మొదలు పెట్టగా 2017లో హైదరాబాద్– బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారి(163)గా అవతరించింది. అయితే రద్దీ అంతంతగా ఉండే మన్నెగూడ నుంచి కర్ణాటక సరిహద్దులోని రావులపల్లి వరకుగల 72 కిలోమీటర్ల మూడు లేన్ల రహదారిని రూ. 250 కోట్ల వ్యయంతో ఇప్పటికే పూర్తి చేశారు. అత్యధికంగా రద్దీ ఉండే మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు 46 కిలోమీటర్ల రహదారి పనుల ప్రారంభం విషయంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తూ వస్తున్నారు. రెండేళ్ల కాలంగా మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ప్రచారం జరుగుతోంది. 10 నెలల క్రితం టెండర్ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఈ క్రమంలో మెఘా సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. రాష్ట్రంలో మంజూరు అయిన హైవేలు అన్ని పూర్తికాగా ఇది మాత్రం ఇంకా ప్రారంభమే కావడంలేదు. దీంతో నిత్యం జిల్లా నలు మూలల నుంచి హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే వారు ప్రాణాలు అరచేతి లో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సి వస్తుంది.

నెత్తురోడుతున్న హైవే..

కర్ణాటక, పరిగి, కొడంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు, వికారాబాద్, తాండూరు వైపు నుంచి వచ్చే వాహనదారులు మన్నెగూడ వద్ద కలుస్తాయి. దీంతో మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు రద్దీ తీవ్రంగా ఉంటోంది. దీనికి తోడు అనంతగిరి చుట్టు పక్కల పర్యాటకం పెరగటంతో రాష్ట్ర రాజధాని నుంచి వికారాబాద్‌కు వచ్చి వెళ్లే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోడ్డుకూడా విపరీతమైన మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగి నెత్తురోడుతోంది. దీంతో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. పోలీసుల లెక్కల ప్రకారం సగటున ఏడాదికి ఈ రహదారిలో 200 మందికి పైగా మృత్యువాత పడుతున్నారు. ఇటీవలి కాలంలో కర్ణాటక, తాండూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్న సిమెంటు ట్యాంకర్లు, ఎర్రమట్టి లారీలు సైతం అధిక వేగంతో దూసుకువెళ్తుండటం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఒక్కోసారి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.

మలుపులు తగ్గించాలని డిమాండ్

వికారాబాద్ నుంచి హైదరాబాద్ వరకు రోడ్డు మార్గంలో ఎక్కువ మలుపులు ఉన్నాయి. రహదారి టెండర్ పనులు కూడా పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడైనా మలుపులు తగ్గిస్తారా? లేక ఉన్నదారి లోనే వేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఈ రోడ్డు రిచ్‌లైన్ (బ్రిడ్జిలు, కల్వర్టులు అవసరం లేకుండా ఎత్తయినా ప్రదేశం గుండా నిర్మించేది) రోడ్డు కావటంతో ఎక్కువ మలుపులు వచ్చాయి. అయితే దీన్ని జాతీయ రహదారి నార్మ్స్ ప్రకారం నిర్మిస్తే రోడ్డు దూరం కొంత తగ్గే అవకాశం కూడా ఉంది. కాగా రియల్ ఎస్టేట్ చేసే కొందరు పెద్దలు ఈ విధానానికి అంగీకరించటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు పెద్దలు హైవే కాకముందే ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసేందుకే రోడ్డు పనులు ప్రారంభించకుండా జాప్యం జరగటానికి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే మంజూరయ్యింది మొదలు రెండేళ్లుగా తామే మంజూరు చేయించామంటే లేదు తామె మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు త్వరగా పనులు ప్రారంభించేలా కృషి చేయకపోవటం విమర్శలకు తావిస్తోంది.



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

970 యూనిట్లకు ఆమోదం

- పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: టీఎస్ ఐపాస్ కింద దరఖాస్తు చేసుకున్న 1,123 యూనిట్లను స్క్రూటిని చేసి 970 యూనిట్లకు కమిటీ ఆమోదించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు గాను దరఖాస్తు చేసుకున్న వారిలో ముగ్గురు ఎస్సీ, పది మంది ఎస్టీ లబ్ధిదారులకు వాహనాల కొనుగోలుపై 35 శాతం సబ్సిడీతో రూ.40,60,549 మంజూరు చేసినట్లు తెలిపారు. ముగ్గురు ఎస్సీ లబ్ధిదారులకు రూ.8,30,652, పది మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ. 32,29,897ల సబ్సిడీని మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 95 దరఖాస్తులను ఆయా కారణాల చేత తిరస్కరించినట్లు తెలిపారు. మిగతా దరఖాస్తులు ఆయా దశల్లో పరిశీలనలో ఉన్నాయన్నారు. ఈ యూనిట్ల ద్వారా నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వినయ్ కుమార్, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు శిఖం భూములు వద్దు

క్రీడా ప్రాంగణాలకు, పల్లె ప్రకృతి వనాలకు శిఖం, చెరువుల భూములను కేటాయించకూడదని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రకృతి వనాలు తెలంగాణ క్రీడా ప్రాంగణాల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇప్పటికీ భూములు కేటాయించని తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థలాన్ని గుర్తించి అప్పజెప్పాలని ఆదేశించారు. గ్రామాల్లో పది గుంటల భూమి అందుబాటులో ఉన్నా అందులో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

కంటి వెలుగుకు ఏర్పాట్లు చేయండి

వికారాబాద్ అర్బన్: కంటి వెలుగు కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమం నిర్వహించే ప్రాంతాలను ముందుగానే గుర్తించి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకొని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులను, యువజన సంఘాల సభ్యులను భాగస్వాములు చేయాలన్నారు. అనంతరం డీఆర్‌డీఏ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అభియాన్ కింద చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణాల్లో రెండు గుంతలు ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న చెక్కులను క్లియర్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగమంచు..చిరుజల్లులు



నార్సింగి ఓఆర్ఆర్ వద్ద పొగమంచు

- వాతావరణంలో అనూహ్య మార్పులు
- కమ్మేసిన కారుమబ్బులు.. ఈశాన్యం నుంచి చలిగాలులు

సాక్షి, సిటీబ్యూరో: తెల్లవారు ఝామున దట్టమైన పొగమంచు..పలు చోట్ల చిరుజల్లులు నగరాన్ని కుమ్మేశాయి. శుక్రవారం సిటీ వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ సమస్యలున్న వారు ఉక్కిరిబిక్కిరయ్యారు. జలుబు, వైరల్ ఫీవర్స్,ఒళ్లు నొప్పులు, గొంతు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య భారీగా పెరిగింది. తూరు, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న చలిగాలులు గజగజలాడిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమవడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు 20.9 డిగ్రీల మేర నమోదైనప్పటికీ..కిందిస్థాయి గాలుల కారణంగా చలితీవ్రత పెరిగినట్లు బేగంపేట్‌లోని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 11 వరకు నగరంలో అతిశీతల పరిస్థితులు నెలకొంటాయని, కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుముఖం పట్టి చలితీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంది. కనిష్ట ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉంటుందని తెలిపింది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో విధిగా మాస్క్ ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహారం విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

శుక్రవారం నగరంలోని ఎల్బీనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట్, పంజగుట్ట, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, చింతల్, బాలానగర్, సుచిత్ర, కుత్బుల్లాపూర్, బేగంపేట, తార్నాక, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించండి

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- సైబర్ నేరగాళ్లపై అప్రమత్తత అవసరం
- తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్



మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్ గౌడ్

తాండూరు టౌన్ : విద్యార్థులు లక్ష్య సాధన దిశలో ముందుకు సాగాలని డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం షీ టీం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తన జీవిత లక్ష్యంపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. లక్ష్య సాధన దిశలో శ్రమించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థి దశలో చదువును మాత్రమే ప్రేమించాలని సూచించారు. మహిళలు, బాలికల పట్ల సోదర భావాన్ని పెంపొందించుకోవాలని, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించరాదని, అలా చేసిన వారు చట్ట ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. ఆధునిక సాంకేతికతను విజ్ఞానాన్ని పెంచుకోవడానికే ఉపయోగించుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలోని అపరిచితులు వస్తే వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలపాలన్నారు. నిత్యం షీటీం సభ్యులు మఫ్టీలో కళాశాల పరిసరాల్లో తిరుగుతుంటారన్నారు. ఎవరైనా వేధిస్తే వెంటనే షీటీం సభ్యులకు చెప్పాలని, చెప్పిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ బోర్డు నోడల్ అధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ రాజ్‌మోహన్, చైల్డ్‌లైన్ ప్రతినిధి వెంకటేశ్, షీటీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరో రెండు నెలల్లో సైకిల్ ట్రాక్





నార్సింగి వద్ద ఏర్పాటు చేస్తున్న సైకిల్ ట్రాక్

- శరవేగంగా పనులు
- మార్చి నాటికి వినియోగంలోకి...
- అంతర్జాతీయ ప్రమాణాలతో 23 కిలోమీటర్ల ట్రాక్
- సుమారు రూ.100 కోట్లతో నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అధునాతన సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరో రెండు నెలల్లో ట్రాక్‌పై సైకిళ్ల పరుగులు తీయనున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని 23 కిలోమీటర్ల మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. పర్యారణ పరిరక్షణ కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఈ నిర్మాణాన్ని చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును రెండు మార్గాల్లో చేపట్టారు. ఔటర్‌ను ఆనుకొని నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కిలోమీటర్లు, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కిలోమీటర్ల మార్గంలో 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్లలో ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలకు దీటైన అభివృద్ధి జరుగుతుందని హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తోన్న సైకిల్ ట్రాక్ నగర ప్రతిష్టను మరింత పెంచుతుందన్నారు.

ఆరోగ్యవిహారం...

సైక్లింగ్ ట్రాక్‌లో సైకిళ్లపైన పరుగులు తీయడం కేవలం ఒక వ్యాయామ ప్రక్రియగానే కాకుండా ఒక విహారంలాంటి అనుభూతిని కలిగించేవిధంగా అందంగా తీర్చిదిద్దుతున్నారు. ట్రాక్ పొడవునా అక్కడక్కడా రెస్ట్‌రూమ్‌లు, కెఫెటేరియాలు, బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లు ఉంటాయి. అలాగే సైకిళ్లను ఇక్కడే అద్దెకు తీసుకోవచ్చు. సైకిళ్లకు పంక్చర్‌లయినా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మరమ్మతులు చేసి ఇస్తారు. ట్రాక్ పొడవునా తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఉంటాయని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. అలాగే ట్రాక్‌ను పూర్తిగా పచ్చదనం ఉట్టిపడేవిధంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ మార్గంలో సైక్లింగ్ చేసేవారికి ఆకుపచ్చ నడవాలు పరుగులు తీస్తున్న అనుభూతి కలుగుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్న ఈ ట్రాక్‌పైన సైక్లింగ్ పోటీలను కూడా నిర్వహించనున్నారు. మరోవైపు భద్రత దృష్ట్యా ట్రాక్ పొడవునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

సౌర విద్యుత్ వినియోగం...

ట్రాక్‌పై కప్పును పూర్తిగా సౌరఫలకలతో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్‌ను ట్రాక్ అవసరాలకు వినియోగించనున్నారు. లైట్లు, తదితర అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను ఇతరులకు వినియోగించే అవకాశం ఉంది. ఈ 23 కిలోమీటర్‌ల ట్రాక్ నిర్మాణం పూర్తయిన తరువాత రెండో దశలో గండిపేట వద్ద అతి పెద్ద సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు.

'మనబడి' వారంలోగా సిద్ధం కావాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ నిఖిల

వికారాబాద్ అర్బన్: మనబడి కింద ఎంపికైన మోడల్ పాఠశాలలను వారం రోజుల్లో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ నిఖిల సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో మన ఊరు – మనబడి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో పాఠశాలలకు రంగులు వేయడంతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయకుంటే కఠిన చర్యలు తప్పవని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నిఖిల

క్రమబద్ధీకరణ తర్వాతే అనుమతులు

జీవో 118 వర్తించే 44 కాలనీల ప్రజలకు నిబంధనలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీవో 118 వర్తించే 44 కాలనీల ప్రజలు కొత్తగా ఇళ్లు కట్టుకోవాలనుకున్నా, పునర్నిర్మించుకోవాలనుకున్నా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయి వారికి హక్కు లభించాకే సాధ్యం కానుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 44 కాలనీల్లోని స్లమ్స్‌లో నివసిస్తున్నవారు,బలహీనవర్గాలు, నిమ్న, మధ్య తరగతి ఆదాయాల వారు ఎంతోకాలంగా ఎదురు చూస్తు న్న క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో 118 జారీ చేయడం తెలిసిందే.సదరు దరఖాస్తుల స్వీకరణ,ఆమోదం బాధ్యతలు, కన్వేయన్స్ డీడ్ నిర్వహణను ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. సంబంధిత కలెక్టర్లు దరఖాస్తుల స్క్రీనింగ్, క్రమబద్ధీకరణ పూర్తిచేశాకే ప్రజలు టీఎస్‌బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవచ్చునని జీహెచ్ఎంసీ పేర్కొంది.టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకొని, భవననిర్మాణం పూర్తయ్యాక అసెస్‌మెంట్ చేసి ఆస్తిపన్ను గుర్తింపు నెంబరు(పీటీఐఎన్) జారీ చేయనున్నట్లు పేర్కొంది. సదరు కాలనీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పార్టీల మధ్య లిటిగేషన్లుండటం, ప్రైవేట్ డెవలపర్ల లేఔట్లలో ఇళ్లు నిర్మించుకోవడం, తదితర కారణాలతో ప్రాథమిక సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటివి జరగలేదు. రెవెన్యూ విభాగం క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్క్రీనింగ్, ఆమోదం పూర్తిచేశాక టీఎస్–బీపాస్ ద్వారా నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని జీహెచ్ఎంసీ తెలిపింది./ టీవల జరిగిన జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం సందర్భంగా సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించింది.

సెల్ఫ్ అసెస్‌మెంట్స్‌తో ఇంటి నంబర్లు రావు..

ఇటీవలి కాలం వరకు ప్రజలు సెల్ఫ్ అసెస్‌మెంట్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు.. ఆస్తిపన్ను ఎంత చెల్లించాలో తెలపడంతో పాటు చెల్లించగానే ఇంటినెంబరు సైతం ఆన్‌లైన్‌లోనే జారీ చేసిన జీహెచ్ఎంసీ.. 'అప్పుడో లెక్క.. ఇప్పుడో లెక్క– అక్రమాలే పక్కా' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనంతో ఆ విధానానికి స్వస్తి చెప్పింది. సంబంధిత డిప్యూటీ కమిషనర్లు పరిశీలించాకే ఇంటినెంబరు కేటాయించే విధానాన్ని ప్రస్తుతం అమల్లోకి తెచ్చింది.

క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయిలో సోషల్ టాలెంట్ టెస్ట్

యాలాల: జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు శనివారం సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సోషల్ ఫోరం ప్రతినిధులు గాజుల బస్వరాజ్, లాలయ్య, యాదయ్యలు తెలిపారు. గత మంగళవారం మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు. ఈ పరీక్షలో సాంఘిక శాస్త్రం నుంచి బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయని, ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు రాయాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలి

పశు సంవర్ధక శాఖ ఏడీ విజయలక్ష్మి



గర్భకోశ పరీక్షలు చేస్తున్న విజయలక్ష్మి

మోమిన్‌పేట: పాడి పశువులను గర్భకోశ వ్యాధులనుంచి కాపాడుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ విజయలక్ష్మి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చీమల్‌ధరి గ్రామంలో గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులతో ఇబ్బందులు వస్తాయన్నారు. రైతులు ఈ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎదకు వచ్చినప్పుడు గోపాలమిత్రకు సమాచారం ఇవ్వడంతో మేలు జాతి రకాల విత్తనంను ఇవ్వడంతో మేలైన రకాల లేగ దూడలు పుడతాయన్నారు. పాల దిగుబడులు ఎక్కువ రావడంతో రైతులు ఆదనపు లాభాలు చేకూరుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి గీత, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాలాల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను యాలాల పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పగిడియాలకు చెందిన ఓ ట్రాక్టర్‌లో నాగసముందర్ గ్రామ శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమతులు లేకుంటే చర్యలు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కుల్కచర్ల ఎస్‌ఐ గిరి హెచ్చరించారు. శుక్రవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హులకు 'ఆత్మ నిర్భర్'

కేంద్రం ప్రభుత్వం వీధి వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు ఇప్పించే ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో వీధి వ్యాపారులకు ఏ బ్యాంకు రుణాలు ఇవ్వలేదని.. ప్రస్తుతం కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ పథకం తమ కుటుంబాలకు ఆదుకుంటోందని వీధి వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఎలాంటి పూచీకత్తు లేకుండా వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాలు
- రెండో విడత పూర్తి
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న మెప్మా ఆర్పీలు



కొడంగల్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించేవారందరికీ బ్యాంకు రుణాలు మంజూరు చేస్తూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ లోన్లు అందజేస్తోంది. పీఎం స్వానిధి ఆత్మ నిర్భర్ కింద వీధి వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తోంది. ఈ పథకంలో భాగంగా మొదటి విడతలో రూ.10వేల రుణ సౌకర్యం, రుణాలను చెల్లించివారికి రెండో విడతలో రూ.20వేలు అందించగా ప్రస్తుతం రూ.20వేల రుణాలను చెల్లించిన వారికి రూ.50వేల రుణాలను మంజూరుచేస్తూ ఆత్మనిర్భర్ పథకం వ్యాపారానికి భరోసా కల్పిస్తోందని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కాలంలో తీసుకున్న రుణాలను లబ్ధిదారులు సకాలంలో చెల్లించడంతో బ్యాంకర్లు రుణ లక్ష్యాన్ని పెంచుతారని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 8,918మంది లబ్ధిదారులను గుర్తించగా ఇందులో 7,200మంది మొదటి విడతలో రుణాలను పొందినట్లు, రెండవ విడతలో 3,865మంది లబ్ధిదారులను గుర్తించగా 2,800మంది లబ్ధిదారులు 20వేల రుణాన్ని పొందారని, రుణాలను సకాలంలో చెల్లించడంతో రూ.50వేల రుణాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందని మెప్మా ఆర్పీలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ లబ్ధిచేకూరుస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం

మెప్మా ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నత చదువులు చదువుతూ నిరుద్యోగంతో ఇబ్బంది పడుతున్నవారికి వివిధ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మెప్మా ద్వారా అదనంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2,420 సంఘాలుండగా ఈ ఏడాదిలో రూ.19.50కోట్ల రుణాలను వివిధ బ్యాంకుల నుంచి అందించినట్లు, మహిళలు, నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి సాధించాలంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



నిరుద్యోగులకు వివిధ కోర్సులలో శిక్షణ ఇస్తూ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మ నిర్భర్ పథకం ద్వారా అందిస్తున్న రుణాలను చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళా సంఘాల ద్వారా మహిళలకు రుణాలను అందిస్తూ అభివృద్ధికి కృషిచేస్తున్నాం. లబ్ధిదారులు అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి సాధించాలి. – రవికుమార్, పీడీ, మెప్మా

సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదలకు మేలు చేకూరుతుందన్నారు. దేశమంతా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసమే ప్రభు త్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రైతు సమన్వయ సమితిమండలకో ఆర్డినేటర్ రాజేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మీర్‌తాహేర్ అలి, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ కేంద్రంలో పీఆర్టీయూ, టీయూటీఎఫ్ 2023 క్యాలండర్‌లు ఆవిష్కరించారు. అనంతరం ఎమెల్యే మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సంఘాలు సంఘితంగా పోరాడాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎంఈఓ హరిశ్చందర్, ఉప సర్పంచ్ రాజేందర్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్, అంజిలయ్య, నాయకులు హరీశ్వర్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు శేఖర్, ప్రసాద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ రాములు

కొడంగల్ రూరల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ అసెంబ్లీ పాలక్ అందె రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం తెలంగాణ రాష్ట్రంలోని 119నియోజకవర్గాల్లో జరిగే బూత్ కమిటీ సమావేశాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని చెప్పారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో బూత్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే దేశంలోని 18రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉందని తెలంగాణలో అధికారం మనదే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయ్యప్పరెడ్డి, నాయకులు మదన్, కె.చంద్రప్ప, నర్సింలు, రాములు, వెంకటయ్య, రవి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో సమావేశమైన రాములు

అనధికార కార్యక్రమానికి అధికారులు

యాలాల: గతేడాది డిసెంబరు 29 నుంచి 31వరకు నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాల కార్యక్రమ ప్రొటోకాల్ వివాదం అధికారుల మెడకు చుట్టుకుంది. క్రీడల ప్రారంభోత్సవ ఆహ్వానప్రతికలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పేర్లు లేకపోవడంతో వివాదం పెరుగుతూ వస్తోంది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిల వర్గ పోరు.. ప్రొటోకాల్ అంశం అధికారులకు తలనొప్పిగా మారింది.

వివాదానికి కారణమైన ఆహ్వాన పత్రం.!


మండలస్థాయిలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడోత్సవాలు పూర్తిగా అనధికారంగా నిర్వహించనవే. ఈ కార్యక్రమానికి యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా వ్యక్తిగతంగా ఆర్థిక వనరులు సమకూర్చారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గానికి చెందిన ఎంపీపీ ఆహ్వానపత్రికలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పేర్లను చేర్చలేదు. కాగా అనధికార కార్యక్రమానికి ఎంపీడీఓ పుష్పలీల, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి పేర్లను ఆహ్వానితులుగా ముద్రించారు. దీనికి తోడు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడోత్సవాల్లో పాలుపంచుకున్నారు. అనధికార కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు ఎలా హాజరవుతారని ఎమ్మెల్సీ గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

ముదురుతున్న ప్రొటోకాల్ వివాదం!

ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సీఎల్ తీసుకుని క్రీడోత్సవాల్లో పాల్గొన్నప్పటికీ ఆ వివాదం మాత్రం అధికారులను విడిచేలా లేదు.

త్వరలో బదిలీ..?

కాగా క్రీడోత్సవాల ప్రొటోకాల్ వివాదంపై గురువారం జెడ్పీ సీఈఓ యాలాల ఎంపీడీఓ పుష్పలీలకు మెమో జారీ చేశారు. క్రీడోత్సవాలు అధికారిక కార్యక్రమమైతే ప్రొటోకాల్ ఎందుకు పాటించలేదు? అనధికారిక క్రీడోత్సవాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఎలా పాల్గొన్నారు? ఈ క్రీడోత్సవాలకు మండల పరిషత్ నిధులు ఏమైనా కేటాయించారా? అనే విషయాలపై వివరణ కోరుతూ ఎంపీడీఓకు మెమో జారీ చేశారు. కాగా గతేడాది జూన్ 5న యాలాల మండల కేంద్రంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన గ్రామీణ క్రీడా మైదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించాల్సి ఉండగా, జూన్ 4న ఎంపీడీఓ సమక్షంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ విషయమై అప్పట్లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఎంపీడీఓపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటనల నేపథ్యంలో త్వరలో ఎంపీడీఓపై బదిలీ వేటు లేదా జెడ్పీ కార్యాలయానికి అటాచ్ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గ పోరులో అధికారుల వ్యవహారం.. 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్న చందంగా మారింది.



వివాదానికి కారణమైన క్రీడోత్సవాల ఆహ్వాన పత్రిక

నాటు పద్ధతితో అధిక దిగుబడులు

కంది పంట పరిశీలించిన డీఏఓ గోపాల్

పెద్దేముల్: నాటు పద్ధతిలో కంది పంట సాగుచేసి అధిక దిగుబడి పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) గోపాల్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో రైతు వేమారెడ్డి వ్యవసాయ పొలంలో కంది పంటలు క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ భద్రత మిషన్ మరియు పరిశోధన స్థానం ద్వార తీసుకొచ్చిన మేలైన కంది రకాలు హనుమాన్, ఆశ వంటి కంది విత్తనాలను వాడుకోవాలని ఆయన సూచించారు. రైతులు నాటు పద్ధతిలో కంది సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయమ్మ, ఏడీఏ రుద్రమూర్తి, ఏఓ నజీరుద్దీన్, ఏఈఓ బాల కోటేశ్వరావు, స్వాతి, వినయ్, శివ, ఉప సర్పంచ్ ఎల్లప్ప, గ్రామస్తులు నర్సింలు, రాజేందర్, మాన్యనాయక్, గౌరప్ప తదితరులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న గోపాల్

చికిత్సపొందుతున్న యువకుడి మృతి



రాము మృతదేహం

కుల్కచర్ల: చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కులకచర్ల గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య కుమారుడు రాము(22)కు ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో భార్యాభర్తలు రాము–సాహితి మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. దీంతో మానసిక వేదనకు గురైన రాము గతేడాది డిసెంబర్ 27న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ గిరి తెలిపారు.

పెరుగుతున్న పత్తి ధర

పెద్దేముల్: పత్తి ధర క్రమంగా పెరుగుతోంది. పదిరోజుల క్రితం రూ.7,300 నుంచి రూ.7,400 పలికిన పత్తి ధర శుక్రవారం రూ.8,250 వరకు పలికింది. పది రోజుల తేడాతో క్వింటాల్‌కు రూ.900 వరకు పెరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రూ.10 నుంచి రూ.12వేల వరకు ధర వస్తేనే పెట్టుబడి మిగులుతుందన్నారు.

రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలి

అనంతగిరి: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్‌లో రవాణారంగం కార్మికుల సంఘర్ష యాత్రను జయప్రదం చేయాలని నిర్వహిస్తున్న జీపుజాత వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పలు రంగాల కార్మికులతో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆర్టీసీని పరిరక్షించాలన్నారు. రవాణరంగ కార్మికులు ఏ చిన్న ప్రమాదమైనా.. అంగవైకల్యం చెందినా సర్కారు నుంచి ఎలాంటి సహాయం అందడం లేదన్నారు. రవాణరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు రంగం వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు మహిపాల్, బాబు నాయక్, జాఫర్, జ్ఞానేశ్వర్, రమేశ్, ఆకాష్, శివ, అనిల్, నవాజ్, బాబు, బద్రీనాథ్, సుదర్శన్, మల్లేశం, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

'మహా సమ్మేళన్'పై బీజేపీ ఫోకస్



కార్యకర్తల సమీకరణ కోసం పార్టీ ముఖ్య నాయకులతో నేతల సమావేశం

- నేడు బూత్ స్థాయి సభ్యుల సమావేశం
- డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా అధినేతల దిశానిర్దేశం
- నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు

తాండూరు: బూత్ స్థాయి సభ్యుల మహాసమ్మేళన్‌పై బీజేపీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించే సమ్మేళన్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లు డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలంటే బూత్ కమిటీ సభ్యుల సమావేశం సక్సెస్ చేయాలని కమల దళపతులు పట్టుదలతో రంగంలోకి దిగారు. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలలో బూత్ స్థాయి మహాసమ్మేళన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం వారం రోజుల నుంచే క్షేత్ర స్థాయిలో కార్యకర్తల సమీకరణకు చర్యలు చేపట్టారు. జిల్లాలో 1130 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటికి అనుగుణంగా బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు 90 శాతం కమిటీలను ఏర్పాటు చేశారు. పరిగి, కొడంగల్ నియోజకవర్గాలలో ఇంకా కమిటీలను వేయాల్సి ఉందని నాయకులు అంటున్నారు. ఒక్కో బూత్‌కు 22 మంది సభ్యులకు స్థానం కల్పిస్తూ కమిటీలను ఏర్పాటు చేశారు.

డిజిటల్ స్క్రీన్‌ల ఏర్పాటు..

నియోజకవర్గ కేంద్రాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే బూత్ స్థాయి మహాసమ్మేళన్ కార్యక్రమంలో డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షులతో పాటు పలువురు ప్రముఖ నాయకులు స్క్రీన్‌లపై సభ్యులకు మార్గదర్శకాలు చేయనున్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు


సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి

దోమ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కారించాలని ఆశవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఆశవర్కర్లతో కలిసి తహసీల్దార్ షాహిదాబేగంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాధవి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు సరిపడ వేతనాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఆశ వర్కర్లను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. సీఐటీయూ పోరాటాల ఫలితంగా 2013 మేలో 45 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలను అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్కీమ్‌లను ప్రైవేటీకరణ చేయకుండా ఆపేయాలని తీర్మాణాలు చేశారు. అయినప్పటికీ ఎనిమిదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వెల్లిబుచ్చారు. ఆశ వర్కర్ల పనిభారం తగ్గించి నెలకు రూ.26వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా పంటల వివరాల నమోదు

ఏడీఏ వినోద్‌కుమార్

నవాబుపేట: పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని వికారాబాద్ వ్యవసాయ ఏడీఏ వినోద్‌కుమార్ అన్నారు. ఏఈఓలు నమోదు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం మండల పరిధిలోని నారెగూడ గ్రామంలో యాసంగి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటలు, కూరగాయలు, శనగ, కుసుమ తదితర యాసంగి పంటల వివరాలను నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు. పంటల నమోదుతోనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇంకా ఎవరైనా నమోదు చేసుకోని పక్షంలో ఏఈఓలను సంప్రదించి నమోదు చేయంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ ఆదీల్, వీఆర్ఏ పరమేశ్, రైతులు తదితరులు ఉన్నారు.



పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న వినోద్

కల్తీ టీపొడి విక్రేతల అరెస్టు

ఏపీలో రాజమండ్రి నుంచి రాష్ట్రానికి సరఫరా

ధారూరు: కల్తీకి కాదేది అనర్హం.. కొందరకు అక్రమార్కులు టీపొడిని కల్తీ చేసి జేబులు నింపుకుంటున్నారు. ఈ మేరకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కల్తీ టీపొడిని విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ధారూరు సర్కిల్ సీఐ అప్పయ్య స్థానిక పీఎస్‌లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి సీఐ వెంకటేశంతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని హరిదాస్‌పల్లి బస్‌స్టేజీ సమీపమై విలేజ్ కేఫ్‌లోని ఓ టీస్టాల్‌లో కల్తీ టీపొడిని వాడుతున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి సీఐ వెంకటేశం స్థానిక ఎస్‌ఐ నరేందర్, సిబ్బందితో కలిసి కేఫ్‌పై దాడిచేసి 10 కిలోల టీపొడిని స్వాధీనం చేసుకున్నారు. యజమాని గట్టెపల్లి మల్లేశంను అదుపులోకి తీసుకుని విచారించారు. జిల్లా పరిధిలతోని బొంరాస్‌పేట్ గ్రామానికి చెందిన ఆళ్లగడ్డ చెన్నకేశవులు నకిలీ టీపొడిని తనకు సరఫరా చేసినట్లు మల్లేశం పోలీసులకు వివరించారు. వెంటనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెన్నకేశవులు నిర్వహిస్తున్న మల్లికార్జున బేకరీపై దాడిచేసి 110 కిలోల టీపొడిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చెన్నకేశవులను అదుపులోకి తీసుకుని ధారూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు నిందితులపై ధారూరు ఎస్‌ఐ నరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అప్పయ్య తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం: సీఐ

నకిలీ టీపొడిని ఎక్కడి నుంచి సరఫరా జరుగుతుందని నిందితులను విచారించగా ఏపీలోని రాజమండ్రి నుంచి ఈ నకిలీ టీపొడిని తయారు చేసి తెలంగాణలో సరఫరా చేస్తున్నట్లు తేలిందన్నారు. నకిలీ పదార్థాల అక్రమ రవాణా చేసిన, ప్రోత్సహించినా రెండుసార్లు కేసులు నమోదైతే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. త్వరలో ఏపీకి వెళ్లి నకిలీ టీపొడిని తయారీదారుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పయ్య